Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు


# RAJADHANI VARTALU

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 333 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 22 - 8 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015



## నేడు అనకాపల్లి, విజయనగరం, విశాఖ జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన

**అమరావతి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి, విజయనగరం, విశాఖ జిల్లాల్లో నేడు సీఎం చంద్రబాబు పర్యటన– ఉదయం 10 గంటలకు అనకాపల్లి జిల్లా కొత్తపాడు మండలం ఆలమండ కోడూరుకు సీఎం చంద్రబాబు– ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులతో సీఎం చంద్రబాబు భేటీ– మధ్యాహ్నం విజయనగరం జిల్లా లక్కవరపుకోటలో సీఎం చంద్రబాబు పర్యటన– సాయంత్రం విశాఖలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం చంద్రబాబు భేటీ.

Andhra Pradesh
Medium Small Daily & Periodicals
Journalists Association

## ఏపీడబ్ల్యూజేఎఫ్ మహాసభల్లో అసోసియేషన్ లోగో ఆవిష్కరణ

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ మీడియం స్మాల్ డైలీ అండ్ పిరియాడికల్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నూతన లోగోను ఆగస్టు 22, 2026 న నిర్వహించనున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ మహాసభల వేదికగా ఘనంగా ఆవిష్కరించనున్నారు. చిన్న, మధ్యతరహా దినపత్రికలు, పీరియాడికల్స్ ఎదుర్కొంటున్న సవాళ్లు, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పడిన ఈ అసోసియేషన్ లోగోను సీనియర్ పాత్రికేయులు, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఫెడరేషన్ నాయకుల సమక్షంలో ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు పాత్రికేయులు, ప్రతినిధులు పాల్గొననున్నారు.



# మహిళల ఆర్థిక స్వావలంబనకు 'రైజ్' కార్యక్రమం చుక్కానిలా నిలుస్తుంది

**- శిక్షణలో పొందిన నైపుణ్యాలను ఉపాధి, స్వయం ఉపాధిగా మలుచుకోవాలి**

**- మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబానికి వెన్నుదన్నుగా నిలుస్తారు**




**విజయవాడ, (రాజధాని వార్తలు):** మహిళలు శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలు, అనుభవాన్ని వినూత్న ఆలోచనలతో మేళవించి వివిధ ఉత్పత్తులను తయారు చేసి, వాటిని మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు 'రైజ్' కార్యక్రమం చుక్కానిలా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఇబ్రహీం పట్నం మండలం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో నిర్వహించిన క్రాఫ్ట్ అండ్ ఆర్ట్స్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ మినీ ఎక్స్‌పోను శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఢిల్లీ నుండి వచ్చిన ఓడిఓపి అధికారి ఇషాదీప్ సింగ్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో ప్రతి మహిళ తనకంటూ ఒక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుని స్వశక్తితో ఎదగాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మహిళ ఆర్థికంగా బలపడినప్పుడు కుటుంబానికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవడంతో పాటు, కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత జీవనశైలి అధిక ఖర్చులతో ముడిపడి ఉందని, కుటుంబ అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగంలో ఏదో ఒక పనిని ఉపాధిగా లేదా వ్యాపకంగా చేపట్టి ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సూచించారు. మహిళల కలలను కార్యరూపంలోకి తీసుకు రావడానికి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా కోట్లాది రూపాయల రుణాలను అందిస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు చిన్నతరహా వ్యాపారాలను ప్రారంభించడంతో పాటు, తాము నేర్చుకున్న నైపుణ్యాలకు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేసి విక్రయించడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. ప్రతి మహిళ ఏదో ఒక నైపుణ్యాన్ని కలిగి ఉండేలా రైజ్ కేంద్రంలో వివిధ రకాల శిక్షణా కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు కేవలం శిక్షణతో ఆగిపోకుండా, తమ నైపుణ్యాలను ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, బ్రాండింగ్ తదితర అంశాలతో అనుసంధానం చేసుకుని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన, వాటి ఉత్పత్తి వ్యయం, విక్రయ ధర, మార్కెటింగ్ విధానం, బ్రాండింగ్, ఉత్పత్తులకు లభిస్తున్న ఆదరణ తదితర అంశాలపై మహిళలతో చర్చించారు. ఉత్పత్తుల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా కొత్త ఉత్పత్తులను రూపొందించాలని సూచించారు. మంచి ఉత్పత్తి తయారీతో పాటు దానికి సరైన మార్కెటింగ్, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, బ్రాండింగ్ ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. రైజ్ కేంద్రం ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకుని తమలోని ప్రతిభను వెలికి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను ఆదాయ వనరులుగా మార్చుకుని, కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంతో పాటు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలకు అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం, ఆర్థిక సహకారం అందించడం ద్వారా వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, రైజ్ మేనేజర్ బి. తేజస్విని, డీఆర్‌డీఏ సిబ్బంది, రైజ్ కేంద్రం సిబ్బంది, శిక్షణ పొందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూత




**ఇంటర్‌నెట్ డెస్క్:** తెలుగు చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం ఆమె చనిపోయారు. షావుకారు జానకి ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆమెను చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 94 ఏళ్ల వయసులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆమె తుది శ్వాస విడిచారు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. షావుకారు జానకి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో.. అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళులు అర్పించటం కోసం ఉంచుతామని తెలిపారు.

**70 ఏళ్ల సినీ ప్రస్థానం..**

టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. 1949 'రక్షా రేఖ' సినిమాతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. విజయవారి 'షావుకారు' సినిమా విజయవంతం అవటంతో.. 'షావుకారు' జానకిగా పాపులర్ అయ్యారు. జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు 400 చిత్రాలలో నటించారు. రోజులు మారాయి, కన్యాశుల్కం, జయం మనదే, పాండురంగ మహత్యం, డాక్టర్ చక్రవర్తి, అక్కాచెల్లెళ్లు, బడి పంతులు, తాయారమ్మ బంగారయ్య, సంసారం ఒక చదరంగం వంటి హిట్ సినిమాల్లో నటించారు. 1955లో 11 సినిమాల్లో నటించిన షావుకారు జానకి.. 'ఏది నిజం' సినిమాకు జాతీయ బహుమతి అందుకున్నారు. ఆమె చివరగా 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' సినిమాలో కనిపించారు. షావుకారు జానకి సొంత చెల్లెలు కృష్ణకుమారి హీరోయిన్‌గా తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

# దసరాలోపు ఇంద్రకీలాద్రిపై భక్తులకు మెరుగైన సేవలు : మంత్రి ఆనం



**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఇంద్రకీలాద్రిపై రానున్న దసరా పండగలోపు భక్తులకు ఇంకా మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఇంద్రకీలాద్రి కొండ దిగువన రూ.52 కోట్లతో నిర్మించిన అన్నదాన నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి ఆనం మాట్లాడుతూ.. ఒకేసారి 800 మంది కూర్చొని భోజనం చేసేలా ఈ భవనాలు నిర్మించామని తెలిపారు. మెకనైజ్డ్ కిచెన్‌కు కొత్త టెక్నాలజీ వినియోగిస్తున్నామని వివరించారు. ఏడాదికి 3 కోట్ల మందికి ఏపీ దేవాలయాల్లో అన్నదానం జరుగుతోందని పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రికి రెండో ఘాట్ రోడ్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని గుర్తు చేశారు. అందుకు సంబంధించిన నివేదిక సిద్ధమవుతుందని అన్నారు. త్వరలో టెండర్స్ పిలుస్తామని చెప్పారు. 25 అడుగుల ఆదిశంకరాచార్యులు విగ్రహాన్ని ఘాట్ రోడ్‌లో ఏర్పాటు చేయాలని కంచి పీఠం వారు కోరారని.. అందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని వెల్లడించారు. రాష్ట్రంలోని ఆలయాలకు భక్తుల సంఖ్య పెరిగిందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు.

**దసరా పనులు ప్రారంభం.. : ఎంపీ కేశినేని చిన్ని**

రూ.50 కోట్ల నిధులతో కొత్త అన్నదాన భవనాలు ప్రారంభమయ్యాయని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని వెల్లడించారు. ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందన్నారు. రాబోయే రోజుల్లో ఇంద్రకీలాద్రిపై మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయని ఆయన చెప్పుకొచ్చారు. మరికొద్ది రోజుల్లో శరన్న వరాత్రులు ప్రారంభమవుతాయని.. అందుకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయని ఎంపీ కేశినేని చిన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో దుర్గ గుడి ఈవో శీనా నాయక్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భారత డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ ప్రయోజన వ్యాజ్యాలు

భారత డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ భారత సుప్రీంకోర్టులో పలు కీలక ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. పారదర్శకత ఉద్యమకారులు, జర్నలిస్టు సంఘాలు (నేషనల్ క్యాంపెయిన్ ఫర్ పీపుల్స్ రైట్ టు ఇన్ఫర్మేషన్ – NCPRI, ది రిపోర్టర్స్ కలెక్టివ్, ఫౌండేషన్ ఫర్ మీడియా ప్రొఫెషనల్స్, నితిన్ సేథి, వెంకటేష్ నాయక్ తదితరులు) దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కలిపి విచారిస్తోంది.

కోర్టులో సవాలు చేయబడిన ప్రధాన చట్టపరమైన వివాదాస్పద అంశాలు:

1. సమాచార హక్కు చట్టం నిర్వీర్యం

వివాదాస్పద సెక్షన్: DPDP చట్టంలోని సెక్షన్ 44(3) ద్వారా ఆర్‌టిఐ చట్టం–2005 లోని సెక్షన్ 8(1)(j)ను సవరించారు.

సవాలు: గతంలో సమాచార హక్కు చట్టం కింద ప్రజలకు సంబంధం ఉన్న లేదా ప్రజా ప్రయోజనం ఉన్న సమాచారాన్ని గోప్యతా కారణాలతో నిరాకరించడానికి వీలుండేది కాదు. కానీ తాజా సవరణతో "వ్యక్తిగత సమాచారం" అనే ముసుగులో ఎలాంటి వివరాలైనా ఇవ్వకుండా పూర్తిగా తిరస్కరించే అవకాశం ప్రభుత్వ అధికారులకు లభించింది. ఇది అవినీతిని దాచి పెట్టేందుకు దారితీస్తుందని, రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19(1)(a) వాక్ స్వాతంత్ర్యం, సమాచార హక్కును దెబ్బతీస్తుందని పిటిషనర్లు వాదిస్తున్నారు.

1. పత్రికా స్వేచ్ఛ మరియు ఇన్వెస్టిగేటివ్ జర్నలిజంపై ప్రభావం

సవాలు: యూరోపియన్ యూనియన్ వారి GDPR తరహాలో భారత DPDP చట్టంలో జర్నలిజానికి ఎలాంటి ప్రత్యేక మినహాయింపులు ఇవ్వలేదు.

వాదన: వ్యక్తుల అనుమతి తీసుకోవాలని లేదా సమాచారాన్ని తొలగించాలని డిమాండ్ చేసే హక్కు ఇవ్వడం వల్ల... అవినీతి లేదా స్కామ్‌లను బయటపెట్టే పరిశోధనాత్మక జర్నలిజానికి, ప్రజా ప్రయోజన రిపోర్టింగ్‌కు తీవ్ర విఘాతం కలుగుతుందని మీడియా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 1. ప్రభుత్వ సంస్థలకు మితిమీరిన మినహాయింపులు (సర్వైలెన్స్ ఆందోళనలు)

వివాదాస్పద సెక్షన్లు: సెక్షన్ 17 మరియు 36 ప్రభుత్వానికి, గూఢచార/దర్యాప్తు సంస్థలకు పౌరుల సమాచారాన్ని సేకరించే విషయంలో విస్తృత మినహాయింపులు ఇస్తున్నాయి.

సవాలు: ఈ నిబంధనలు చారిత్రాత్మక పుట్టస్వామి (రైట్ టు ప్రైవసీ) తీర్పు నిర్దేశించిన ప్రమాణాలకు (చట్టబద్ధత, సరైన లక్ష్యం, దామాషా పద్ధతి – Proportionality) విరుద్ధంగా ఉన్నాయని, ఇది ప్రభుత్వం చేసే సామూహిక నిఘాకు దారి తీస్తుందని సవాలు చేశారు.

1. డేటా ప్రొటెక్షన్ బోర్డ్ స్వతంత్రత

వివాదాస్పద సెక్షన్లు: సెక్షన్లు 18 నుంచి 20.

సవాలు: డేటా ప్రొటెక్షన్ బోర్డు సభ్యుల ఎంపిక, వేతనాలు, పదవీకాలం, తొలగింపు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయి. ప్రభుత్వ సంస్థలపై వచ్చే ఉల్లంఘనల ఫిర్యాదులను విచారించాల్సిన బోర్డుకు స్వయంప్రతిపత్తి లేకుండా పోయిందని పిటిషనర్లు పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు ప్రస్తుత స్థితి సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ పిటిషన్లపై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసి, గోప్యతా హక్కు మరియు సమాచార హక్కుల సమతుల్యతను సమీక్షించేందుకు కేసులను విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి సిఫారసు చేసింది. అయితే చట్టం అమలుపై ఎలాంటి మధ్యంతర స్టే విధించకపోవడంతో కార్పొరేట్ మరియు సాంకేతిక సంస్థలు చట్ట నిబంధనల అమలు ప్రక్రియను కొనసాగిస్తున్నాయి.

# అలనాటి నటి షావుకారు జానకి మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం

**అమరావతి, (రాజధాని వార్తలు):** అలనాటి ప్రముఖ నటి షావుకారు జానకి (94) ఆకస్మిక మరణం నాకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. 400కు పైగా చిత్రాల్లో నటించి ఎన్నో అవార్డులు, రివార్డులు పొందిన షావుకారు జానకి భౌతికంగా మనకు దూరం అయినా ఆమె నటించిన పాత్రల ద్వారా చిరస్థాయిగా మన మనసుల్లో నిలిచిపోతారు. షావుకారు జానకి ఆత్మకు ఆ భగవంతుడు శాంతి చేకూర్చాలని కోరుకుంటున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను.

# ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అనకాపల్లి జిల్లాలో అవగాహన ర్యాలీ

**- "దోమల నియంత్రణ - వ్యాధుల నివారణ - ప్రజల భాగస్వామ్యంతో ఆరోగ్యకరమైన సమాజం" - జెండా ఊపి ప్రారంభించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.అచ్చుతకుమారి**







**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లాలో ప్రజల్లో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. అచ్చుతకుమారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డా.చంద్రశేఖర్ దేవ్, జిల్లా మలేరియా అధికారి (డియమ్ఓ), ప్రోగ్రామ్ అధికారులు, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.అచ్చుతకుమారి మాట్లాడుతూ ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ప్రజలు దోమల నివారణలో భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండ కుండా చూసుకోవడం, వారానికి ఒకసారి డ్రై డే పాటించడం, దోమల లార్వా వృద్ధి చెందే ప్రదేశాలను తొలగించడం, దోమతెర లను ముఖ్యంగా కావలను సక్రమంగా వినియోగించడం ద్వారా దోమల కాటును నివారించవచ్చని తెలిపారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అధికారులు పేర్కొన్నారు. జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. "దోమల నియంత్రణ - వ్యాధుల నివారణ.. ప్రజల భాగస్వామ్యంతో ఆరోగ్యకరమైన సమాజం" అనే సందేశంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెల్లెట్ గన్స్ ఘటనపై కేసు.. ప్రియాంకతో కలిసి రాహుల్ ధర్నా



**ఢిల్లీ :** విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగించారనే ఆరోపణలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు ఇతర కాంగ్రెస్ నేతలు పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో బైఠాయించి నిరసనకు దిగారు. విద్యార్థులపై పెల్లెట్ గన్స్‌తో కాల్పులు జరిపిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి..బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాహుల్ డిమాండ్ చేశారు. పెల్లెట్ గన్స్ కారణంగా గాయాలైన విద్యార్థి సాహిల్ లోచావ్‌ను వెంట తీసుకుని రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. కాల్పుల జరిపిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి.. బాధ్యులపై కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. విద్యార్థులపై బలప్రయోగం చేయడంపై ప్రభుత్వం, పోలీసులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్‌లోనే బైఠాయించి నిరసన చేపట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రాహుల్‌తో పాటు ప్రియాంక గాంధీ, ఇతర కాంగ్రెస్ నాయకులు కూడా నిరసనలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు పెల్లెట్ గన్స్ ఫైరింగ్ ఘటనపై ఎట్టకేలకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగించిన ఘటనకు బాధ్యులెవరో గుర్తించి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. రాహుల్ గాంధీ ధర్నా నేపథ్యంలో పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.


# 36 వార్డుల గెజిట్ ఉత్తర్వులు ప్రదర్శన




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజనకు సంభందించి గెజిట్ నోటిఫికేషన్‌ను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం ప్రకటించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎన్ కనకారావు మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం జనవరి 1 ఉత్తర్వుల ప్రకారం సామర్లకోట మున్సిపా లిటీలో ఉన్న 31 వార్డులను 36 వార్డులుగా విభజించేందుకు తయారు చేసిన ప్రతిపాదనలు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఆమోదం లభించినట్టు చెప్పారు.

దానికి సంభందించి గెజిట్ ప్రతులను అన్ని సచివాలయాల్లో, తహశీల్దార్ కార్యాలయంలో, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో, శాఖ గ్రంధాలయంలో ప్రజల సమాచారం కోసం ప్రదర్శించినట్టు కమిషనర్ చెప్పారు.

# "రైయ్ ..రైయ్ ..మంటున్న సోమిరెడ్డి అవినీతి"




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి అవినీతి, అక్రమా లకు, అడ్డు లేకుండా పోయింది. సోమిరెడ్డితో పాటు, సోమిరెడ్డి కొడుకు, సోమిరెడ్డి అల్లుడు, ముగ్గురు కలిసి సర్వేపల్లిని దోచుకుంటున్నారు. సర్వేపల్లిలోని సహజ వనరులు, ప్రకృతి సంపదను దోచుకుంటూ, కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో, ఎటు చూసినా అక్రమంగా తరలిపోతున్న గ్రావెల్ టిప్పర్ల సందడి తప్ప, అభివృద్ధి, సంక్షేమం, ఊసే కనిపించడం లేదు.

సోమిరెడ్డి దిగిపోయే నాటికి సర్వేపల్లి మొత్తం దోపిడీకి గురవుతుందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న సర్వేపల్లి ప్రజానీకం. సోమిరెడ్డి బాహాటంగా తనకు పదవులు అవసరం లేదని, ధన సంపాదనే ధ్యేయంగా పనిచేస్తానని బాహాటంగానే మాట్లాడడం తెలుగుదేశం పార్టీ నేతలకు కూడా విస్మయం కలిగిస్తుంది. సోమిరెడ్డి కుటుంబం దోపిడీతో, సర్వేపల్లి పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడం లేదని తీవ్ర ఆందోళనలో సర్వేపల్లి ప్రజలు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ దోమల దినోత్సవం



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** నియోజకవర్గంలోని తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ దోమల దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లహరిని సంపూర్ణ ఆధ్వర్యంలో రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలవేసి, అతను చేసిన సేవలు గురించి స్మరించుకున్నారు. అనంతరం ప్రపంచ మలేరియా దినోత్సవంపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లహరిని సంపూర్ణ పిహెచ్ ఎన్ నాగేంద్ర, ఎంపిహెచ్ ఏ (హెచ్ ఎస్) ధనమ్మ, ఎంపిహెచ్ ఏ (హెచ్ ఎస్) వెంకటేశ్వర్లు ముదిరాజ్ ఎంపీహెచ్ ఎం (ఎం) నీరజ స్టాఫ్ నర్స్ నరేష్ ఫార్మసిస్ట్ భాను ల్యాబ్ టెక్నిస్ట్ సంధ్య ఏఎన్ఎం వరలక్ష్మి ఏఎన్ఎం భారతి, ఆశ, స్కూల్ హెడ్మాస్టర్ సుబ్రహ్మణ్యం, స్కూల్ టీచర్ నిఫీసా, గిరిబాబు పాల్గొన్నారు.

# వృద్ధుల సమక్షంలో ఘనంగా సిద్ధారెడ్డి జనార్దన్ రెడ్డి జయంతి



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణంలోని సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కీర్తిశేషులు సిద్ధారెడ్డి జనార్దన్‌రెడ్డి 89వ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన ధర్మపత్ని, తూర్పు కనుపూరు ముత్యాలమ్మ ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనారెడ్డి, కుమారులు వెంకట సుధీర్‌రెడ్డి దాతృత్వంతో సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం అందజేశారు. అనంతరం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో బాలింతలకు బెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి ప్రజేంద్రరెడ్డి మాట్లాడుతూ.. సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి ఎంతోమంది పేదలకు అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అళగనాథ స్వామి దేవస్థా నం ఛైర్మన్‌గా విశిష్ట సేవలందించడంతో పాటు, టీటీడీకి మార్గద ర్శకంగా విలువైన సలహాలు అందించి ఆలయ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దశరథ రామిరెడ్డి, మండి శ్రీనివాసులురెడ్డి, గోపాల్ యాదవ్, ధనుంజయరెడ్డి, సనత్ కుమార్‌రెడ్డి, సిద్ధారెడ్డి, హరినాథ్‌రెడ్డి, శారదారెడ్డి, సురేష్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# మూడు గంటల్లో బాలుడి ఆచూకీ.. కరప పోలీసుల చాకచక్యం



**కరప, (రాజధాని వార్తలు):** మండల కేంద్రం కరపలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర వసతి గృహంలో ఏడో తరగతి చదువుతున్న 12 ఏళ్ల బాలుడు అదృశ్యమైన ఘటనపై కరప పోలీసులు వేగంగా స్పందించి మూడు గంటల్లోనే ఆచూకీ కనుగొన్నారు. పెద్దాపురం మండలం చిన్న తిరుపతి గ్రామానికి చెందిన బోర సత్యవతి, సుబ్రహ్మణ్యం దంపతుల కుమారుడు అవినాష్ కరపలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర హాస్టల్‌లో ఉంటూ ఏడో తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం 8 గంటల సమయంలో పాఠశాల నుంచి బాలుడు వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో బాలుడి తల్లి సత్యవతి మధ్యాహ్నం 1.45 గంటలకు కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు వెంటనే బాలుడు అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో, అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.చైతన్య కృష్ణ పర్యవేక్షణలో సబ్ ఇన్స్పెక్టర్ తోట సునీత కరప పోలీస్ సిబ్బందితో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసు బృందాలు వివిధ ప్రాంతాల్లో గాలింపు చేపట్టి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ బాలుడి ఆచూకీ కోసం విస్తృతంగా ప్రయత్నించాయి. పోలీసుల సమన్వయంతో కేవలం మూడు గంటల్లోనే బాలుడి ఆచూకీని గుర్తించి, సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడి ఆచూకీని తక్కువ సమయంలోనే గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించడంపై కరప పోలీసుల పనితీరుపై స్థానికులు అభినందనలు తెలిపారు.

# సప్త జలాభిషేఖానికి ఇత్తడి బిందెలు అందజేత



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో వేంచేసిఉన్న శ్రీ విశ్వేశ్వర చంద్రశేఖర స్వామి దేవస్థానంలో సెప్టెంబర్ 6న జరుగనున్న "సప్త జలాభిషేకం" పూజలకు గానూ దాతల సహకారంతో రూ.15,000 విలువ గల 8 ఇత్తడి బిందెలు ఆలయంలో గురువారం సిద్ధం చేశారు.

ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి కె జగదీశ్వర రావు మాట్లాడుతూ దాతలు బి వెంకటరమణ, కె శ్రీనివాసరావు, ఎస్ నీలకం ఠేశ్వరరావు, పి కోటిలింగేశ్వరరావు, పి గోవింద రాజులు ముందుకు వచ్చి స్వామివారి పూజలకు ఈ ఇత్తడి బిందెలు సమర్పించినట్టు చెప్పారు. కాగా ఈ సందర్భంగా దాతల నుంచి వాటిని స్వీకరించి వారికి ఆలయంలో ఆశీర్వచనాలను ఆలయ అర్చకులచే ఈవో అందజేశారు.

# మలుపులో గొయ్యి పూడ్చారు

## - ప్రమాదాలకు నిలయం మలుపులో గొయ్యి కథనానికి స్పందించిన అధికారులు





**అల్లవరం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బెండమూర్లంక నుండి ఓడలరేవు వెళ్లే రహదారిలో మంగళవారం సంత మలుపు వద్ద ఏర్పడిన పెద్ద గొయ్యను అధికారులు ఎట్టికేలకు పూడ్చారు. సాగర సాక్షి దినపత్రికలో "ప్రమాదాలకు నిలయం మలుపులో గొయ్యి" అనే వార్తా కథనం వెలువడగా ఆర్ అండ్ బి అధికారులు స్పందించారు.

మలుపులో ఏర్పడిన పెద్ద గొయ్యను వెటమిక్స్‌తో పూడ్చారు. అధికారులు గొయ్యిను పూడ్చడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# వైసీపీ నాయకులతో బూదూరు గురవయ్య భేటీ



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు నియోజకవర్గ పరిధిలోని చిట్టమూరు మండలానికి చెందిన పలు గ్రామాల్లో వైసీపీ నాయకులను గూడూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త బూదూరు గురవయ్య వైసిపి నాయకులతో కలిసి భేటీ అయ్యారు. ముఖ్యంగా చిట్టమూరు మండలం బురదగాలి కొత్తపాలెం, సోమ సముద్రం, కొత్తగుంట గ్రామాలకు చెందిన చెందిన వైసీపీ నాయ కులు మాజీ సర్పంచ్ మణి, గజేంద్ర రెడ్డి, గిరి రెడ్డి, దయాకర్ రెడ్డి, ఈశ్వర్ శెట్టి, అద్దిపూడి గ్రామ వైసీపీ నాయకుడు రమేష్, సోమ సముద్రం గ్రామ వైసిపి నాయకులు ధారా సుబ్రహ్మణ్యం, కొత్త గుంట వైసిపి నాయకులు సుబ్బారెడ్డి కండి గ్రామా నాయకులు బండి కృష్ణయ్యలను సాయికుమార్, వారి వారి నివాసాలలో గూడూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ బూదూరు గురవయ్య కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు అట్ల శ్రీనివాసులు రెడ్డి, ఇందుకూరు జనార్ధన్ రెడ్డి, మనుబోలు కిష్టయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఆహా.. నేను ఒక్కరోజు ప్రధానినైతే!

భారతదేశం 80వ స్వాతంత్ర్య సంవత్సరంలోకి ప్రవేశించిన శుభ తరుణమిది. ఈ గొప్ప దేశానికి నేను ఒకే ఒక్క రోజు ప్రధానమంత్రిగా ఉన్నా ఎర్రకోట ప్రాకారం నుంచి నేను వెలువరించే స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం ఎలా ఉండాలో ఊహించేందుకు సాహసించాను. ఆ ఆలోచనా ఫలితమే ఇది: ఈ రోజు నేను కేవలం ఒక ప్రధానమంత్రిగా కాకుండా మీ ప్రధాన సేవకుడిగా ఇక్కడ నిలబడ్డాను. ప్రధాన సేవకుడు అనే మాటను మీరు వినే ఉంటారని నాకు తెలుసు. అయితే నేను చెప్పినవి చేస్తాను, వాగ్దానాలు నెరవేరుస్తాను. పదవీ బాధ్యతలు చేపట్టిన నెలరోజులలోనే నేను, నా మంత్రులు అందరూ తమ సువిశాల అధికారిక లుట్యెన్స్ బంగ్లాల నుంచి చిన్న గృహాలకు మారాలని నిర్ణయించాను. అనవసర విదేశీ యాత్రలను విరమిస్తాను. అవార్డు ప్రదానాల కార్యక్రమాలకు వెళ్లకూడదని నిశ్చయించుకున్నాను. ప్రభుత్వ హోర్డింగులు, బిల్లు బోర్డులు, వాణిజ్య ప్రకటనల్లో నా బొమ్మ ఉండకూడదని నా పార్టీకి సూచించాను, ముఖ్యమంత్రులందరికీ ఆదేశాలు జారీ చేశాను. వ్యక్తిపూజకు రోజులు చెల్లిపోయాయి. ప్రజాస్వామ్యమనేది ఏకవ్యక్తి ప్రదర్శన ఎంత మాత్రం కాదు.. ప్రధానమంత్రి పదవి తాత్కాలికమే. గణతంత్ర రాజ్యమే శాశ్వతం. ఈ శుభవేళ మరో వాగ్దానం చేస్తున్నాను. భారత ప్రభుత్వం ఏ ఒక్క నిర్దిష్ట మతంతోనూ తనను తాను గుర్తించుకోదు. నేను మతాన్ని పాటిస్తాను. అయితే ఆ మతాచరణలు నా ఇంటికీ, మనస్సాక్షికి మాత్రమే పరిమితం. ప్రధాన మంత్రిగా నాకు ఒకే ఒక్క పవిత్ర గ్రంథం ఉన్నది: భారత రాజ్యాంగం. అవినీతిని తుదముట్టించేందుకు నిశ్చయించుకున్నాను. ఈ స్వాతంత్ర్య దినోత్సవ శుభవేళ జెన్‌జీకి ఒక విషయాన్ని సూటిగా చెప్పదలుచుకున్నాను. మిమ్ములను తప్పుగా అర్థం చేసుకున్నందుకు క్షమాపణలు చెబుతున్నాను. ప్రశ్నపత్రాల లీక్‌లు, ఉద్యోగాల అలభ్యతపై మీ ఆగ్రహం, అసంతృప్తి ఎంత తీవ్రంగా ఉన్నాయో మేము తక్కువగా అంచనా వేశాము. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, సోషల్ మీడియా పోస్టులు, హ్యాష్‌ట్యాగ్‌ల ద్వారా మీకు సన్నిహితమవచ్చని భావించాము. అది తప్పు అని అర్థమయింది. యువజనులు నిరసనగా వీధుల్లోకి వచ్చినప్పుడు ఒక ప్రజాస్వామిక వ్యవస్థ మొదటి ప్రతిస్పందన వారు మౌనం వహించేలా చేయడం కాదు, లేదా వారిని 'దిమాగి నక్సల్స్'గా, దేశద్రోహులుగా చూడడం అంతకంటేకాదు, యువత సమస్యలను సానుభూతితో వినడమూ, పట్టించుకోవడమే. స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి అందరికీ ఉద్యోగాలు లభించేలా చేయడమే నా లక్ష్యం. కృత్రిమ మేధ లక్షలాది ఉద్యోగాలను హరించివేస్తోంది. పని ప్రదేశం తీరుతెన్నులను ఆటోమేషన్ మార్చివేస్తోంది. అయితే ప్రతి సాంకేతిక విప్లవమూ కొత్త అవకాశాలను కూడా సృష్టిస్తుంది. ఆ నూతన అవకాశాలను అందిపుచ్చుకునేలా యువజనులను మనం సంసిద్ధపరచవలసిన అవసరమున్నది. 1991లో ఆర్థిక వ్యవస్థను సరళీకరించి అపూర్వ అభివృద్ధిని సాధించాము. 2026లో మన ఆలోచనలను సరళీకరించుకోవల్సిన సమయం ఆసన్నమయింది. నాకు సన్నిహితులుగా పరిగణన అవుతున్న ఏ వ్యాపారవేత్తకూ అనుకూలంగా నిర్ణయాలు తీసుకోనని మీకు హామీ ఇస్తున్నాను. భారతీయ మహిళలకు నా సందేశం ఏమిటంటే బేటీ బచావో, బేటీ పడావో (ఆడపిల్లలను రక్షించండి, ఆడపిల్లలకు చదువు చెప్పండి) అనేది ఒక శక్తిమంతమైన నినాదం. అయితే ప్రభుత్వాల పాలనాదక్షతను నినాదాల ప్రాతిపదికన నిర్ణయించకూడదు. చేపట్టిన కార్యక్రమాలు సాధించిన ఫలితాల ఆధారంగానే ప్రభుత్వాల పనితీరుపై తీర్పు ఇవ్వాలి. ఇక నుంచి ప్రతి ఎన్నికలలోను 50 శాతం టిక్కెట్లను మహిళలకే ఇవ్వాలని నా పార్టీ స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకున్నది. సాధికారత గురించిన ప్రసంగాలు మహిళలకు అవసరం లేదు. వారికి భద్రత, అవకాశాలు, సమాన అధికారాలు అవసరం. వీటిని తక్షణమే కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఇక ఇప్పుడు పార్లమెంటు గురించి మాట్లాడతాను. ప్రతి బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్ష సభ్యులు అడిగే ప్రశ్నకు సమాధానాలు ఇస్తుంటాను. ప్రజాస్వామ్యం అంటే మీ ప్రత్యర్థి నోరు మూయించే కళ కాదు, వారికి సమాధానమిచ్చే కౌశలం. సరే, నా మీడియా స్నేహితులకు ఒక సంతోషకరమైన విషయం చెప్పదలిచాను. ప్రతి మూడునెలలకొకసారి విలేఖర్ల సమావేశంలో పాల్గొంటాను. ఏ విషయం మీదనైనా మీరు నన్ను ప్రశ్నించవచ్చు. అధికారానికి భయపడవద్దని మీడియాకు నేను స్పష్టంగా చెబుతున్నాను. ప్రభుత్వాన్ని ఆనందపరచడం మీ విధ్యుక్త ధర్మం కాదు. ప్రశ్నించడమే మీ విధి. అవును, నాతో సహా ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఒక్కరినీ మీరు ప్రశ్నించాలి. ఇప్పుడు మన నేర న్యాయ విచారణ వ్యవస్థ గురించి రెండు మాటలు చెప్పదలిచాను. సమాజంలోని అవినీతిపరులకు అనుకూలంగా వ్యవహరించే పోలీసు వ్యవస్థతో మనం ఆధునిక సమాజాన్ని నిర్మించుకోలేము. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పోలీస్ సంస్కరణలను శీఘ్రగతిన అమలుపరుస్తున్నాను. తద్వారా అవినీతి రాజకీయ నాయకులు- పోలీసుల మధ్య చట్ట విరుద్ధ, హానికర బంధాన్ని రూపుమాపుతాను. మన గౌరవనీయ న్యాయమూర్తులకు ఒక విషయాన్ని స్పష్టం చేయదలిచాను. ఈ రోజు ఒక ఇబ్బందికరమైన తీర్పు ఇచ్చినందుకు రేపు మరే ప్రభుత్వ పదవిలోనూ నియమించరనే భయం వద్దు. కలతపడవద్దు. పదవీ విరమణ తరువాత న్యాయమూర్తులను మరింత ఉన్నత పదవులలో నియమించే సంస్కృతికి స్వస్తి చెబుతున్నాను. నిర్భీతితో స్వతంత్రంగా వ్యవహరించే న్యాయవ్యవస్థ మనకు అవసరం. న్యాయాధికారులు నా ఉద్యోగులు కారు. వారు రాజ్యాంగ సంరక్షకులు. ఎన్నికల సంఘంలో కూడా సంస్కరణలు అమలు పరచాలని నిర్ణయించాను.

# నడిసముద్రంలో ఏ దిక్కున ఉన్నారో.. - 20 రోజులైనా కానరాని జాడ


## - బిక్కు బిక్కుమంటూ గంగమ్మ వైపు ఎదురు చూస్తున్న ఆ మత్స్యకార కుటుంబాలు - పేదరికం మాటున బరువెక్కిన హృదయాలు


కాటాడి సతీష్ కుమార్


కొల్లాటి శ్రీను బాబు


కొల్లాటి ఏసుదాసు


సంగాని తాతారావు


పాలెపు శాంతారావు


కొపనాతి రామకృష్ణ వర్మ



**అల్లవరం, (రాజధాని వార్తలు):** కడలి కన్నెర్ర చేసిందో.. కనికరించిందో ఆ గంగపుత్రులకు కనుచూపు మేరలో ఏ దిక్కూ కానరాలేదా..20 రోజులైనా జాడ దొరకక పోవడంతో వేటకు వెళ్లిన మత్స్యకారుల కుటుంబాలు బరువెక్కిన హృదయాలతో గంగమ్మ తల్లి వైపు ఎదురు చూస్తున్నాయి. ఏ క్షణానైనా జాడ తెలుస్తుందేమోనన్న చిగురంత ఆశతో బిడ్డ కోసం తల్లి, నాన్న కోసం బిడ్డలు, భర్త కోసం భార్య కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. రెక్కాడితేనే గాని డొక్కాడని కడు పేద కుటుంబాలకు పిడుగులాంటి కష్టం వచ్చి పడింది. పెళ్లయ్యి ఐదేళ్లు నాలుగేళ్ల పసిబిడ్డలు. కుటుంబానికి అతనే దిక్కైన మరో కొన్ని కుటుంబాలు.. పిల్లల పెళ్లిళ్లు చేయాల్సిన బాధ్యత గల తండ్రులు ఇలా కుటుంబ భారాన్ని మోస్తూ సముద్రంలో వేటకు వెళ్లి ఎక్కడున్నారో తెలియక క్షణక్షణం క్షోభ అనుభవిస్తూ ఎదురు చూస్తున్న ఆ ఏడుగురు మత్స్యకారులు కుటుంబాల హృదయ వేదన వర్ణనాతీతం. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు వచ్చి భరోసా ఇచ్చినా వారి కుటుంబ సభ్యుల హృదయాలు తేలిక కావడం లేదు. రోజులు గడుస్తున్నాయి దుఃఖం ఆగటం లేదు సముద్రమంతా స్పీడ్ బోట్లు, విమానాలతో గాలిస్తున్నారని ఏ క్షణమైనా ప్రాణం లెగుసొచ్చే తీయని కబురు వినక మానతామ అని ఆశగా ఎదురు చూస్తున్నాయి. ఎవరు ఎంత ఓదార్చినా భరోసా ఇచ్చినా జాడ తెలిసింది అనే కబురు తెలిసే వరకు ఆ కుటుంబాలకు కడుపు నిండా ఆహారం కంటి నిండా నిద్ర లేని రోజులే. వారంతా క్షేమంగా తిరిగి రావాలని దేవుని ప్రార్థిస్తూ వేడుకుందాం.

# పెద్దాపురంలో ఉచిత వైద్య శిబిరం




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** "మానవ సేవయే మాధవ సేవ" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు 1600కు పైగా ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి లక్ష లాది మంది పేద ప్రజలకు విశేష సేవలు అందించిన ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ "వర్డ్" ఆధ్వర్యంలో పాత పెద్దాపురం 1వ వార్డులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులచే జనరల్ వ్యాధులకు సంభందించి, కంటి పరీక్షలు, దంత వైద్యం, బీపీ, బ్లడ్ షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. శిభిరానికి విచ్చేసిన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి 50 శాతం రాయితీతో కళ్ళజోళ్ళు, శస్త్రచికిత్స (ఆపరే షన్) అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరే షన్లు చేయడానికి ఏర్పాట్లు చేశారు. "మానవ సేవే మాధవ సేవ" అనే పవిత్ర నినాదంతో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి దాదాపు 350 మందికి పైగా ప్రజలు హాజరు కాగా, వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో "వర్డ్" సంస్థ బోర్డు సభ్యులు, ఆరెళ్ల రాఘవలు లోకల్ కోఆర్డినే టర్లు, ఏరియా ఇన్‌చార్జ్‌లు, పి4 ఆఫీస్ ప్రతినిధి కిరణ్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

# సమస్యల తక్షణ పరిష్కారం లక్ష్యం : ఎమ్మెల్యే



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజా ధర్బార్ నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. నియోజకవర్గంలో గురువారం సాయంత్రం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఆయన ప్రజలను స్వయంగా కలిసి వారి సమస్యలను తెలుసుకుని వాటినుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు అందించిన ప్రతి ఫిర్యా దును పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ త్వరిత గతిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామ, వార్డు స్థాయిలో నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం వారితో మమేకమై ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, వారి సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం చొరవ చూపాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, నాయకులు మొయిళ్ళ కృష్ణమూర్తి, నూనె రామారావు, పాలకుర్తి శ్రీనుబాబు, పాలకుర్తి శ్రీనుబాబు, బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రంగనాగ్‌చే మేజర్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మున్సిపాలిటీ 10వ వార్డు పరిధిలోని కుమ్మరి వీధి (సంత మార్కెట్ రోడ్డు సమీపంలో) రూ. 30 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న మేజర్ డ్రైనేజీ పనులకు గురువారం జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసారు. పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మున్సిపల్ ఏఇ, డిఇలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగనాగ్, సూరిబాబు రాజులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో పెద్దాపురం పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాన్నారు. ఈ డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేసి స్థానిక ప్రజల ఇబ్బందులను శాశ్వతంగా తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# చించినాడ బ్రిడ్జిపై రాకపోకలు ప్రారంభం



**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఎట్టకేలకు ఉభయ గోదావరి జిల్లాల ప్రజల నిరీక్షణకు తెరపడింది. దిండి-చించినాడ వంతెనపై భారీ వాహనాల రాకపోకలు బుధవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. వంతెన మరమ్మతుల కారణంగా గత కొన్ని నెలలుగా భారీ వాహనాల రాకపోకలను నిలిపి వేయడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ పదుల సంఖ్యలో కిలోమీటర్ల దూరాన్ని చుట్టు తిరుగు ప్రయాణాలు చేయాల్సి వచ్చింది. దూరభారాలతో ప్రయాణికులు సమయం, డబ్బు నష్టపోవడమే కాకుండా తీవ్ర అవస్థలకు గురయ్యారు. చించినాడ వంతెనకు మరమ్మత్తులు పూర్తయిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భారీ వాహనాల రాకపోకలకు అనుమతించడంతో దూరాభారం తగ్గి వాహనదారులు, ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన తహసీల్దార్



**చేజర్ల, (రాజధాని వార్తలు):** పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చేజర్ల మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) ఆర్.మస్తానయ్య సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని చీర్లవారికండ్రిగ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, మెనూ అమలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్న అనంతరం, ఆయన నేరుగా విద్యార్థుల సరసన కూర్చొని సహపంక్తి భోజనం చేశారు. ఆహారాన్ని స్వయంగా రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ రోజూ నిబంధనల ప్రకారం నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని మాత్రమే అందించాలని వంట చేసే ప్రదేశంతో పాటు పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. భోజనం తయారీ, పంపిణీలో ఎలాంటి అలసత్వం వహించినా చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. విద్యార్థులతో మమేకమై, ఆప్యాయంగా పలకరిస్తూ వారితో కలిసి భోజనం చేసిన తహసీల్దార్ చొరవపై ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్.. ప్రేమలు భామ దారెటు?




మమిత బైజు పేరు ఈమధ్య సోషల్ మీడియాలో ఏ రేంజ్‌లో తిరుగుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. 'ప్రేమలు'తో ఒక్కసారిగా తెలుగు, తమిళ ప్రేక్షకులకు దగ్గరైన ఈ అమ్మాయి.. ఆ తర్వాత వరుసగా మంచి సినిమాలు పట్టేస్తోంది. ఇప్పుడు 'విశ్వనాథ్ అండ్ సన్స్' తర్వాత వచ్చిన రెస్పాన్స్ చూస్తుంటే మమిత నెక్స్ట్ ఎవరితో చేస్తుందన్నదే ఎక్కువ ఇంట్రెస్ట్‌గా మారింది. 'ప్రేమలు'లో రీను పాత్ర మమితకు బాగా కలిసి వచ్చింది. నేచురల్ లుక్, సింపుల్ క్యారెక్టర్ కావడంతో ఆ సినిమా తర్వాత ఆమెకు మంచి ఫాలోయింగ్ వచ్చింది. తర్వాత ప్రదీప్ రంగనాథన్‌తో 'డ్యూడ్', విజయ్ 'జన నాయకన్', ధనుష్ 'కారా' లాంటి సినిమాలతో తమిళంలో కూడా వరుసగా పెద్ద ప్రాజెక్టుల్లో కనిపించింది. ఇప్పుడు సూర్యతో 'విశ్వనాథ్ అండ్ సన్స్' చేయడం వల్ల స్టార్ హీరో పక్కన కూడా మమిత ఎలా కనిపిస్తుందో ఒక క్లారిటీ వచ్చేసింది. ఇక్కడే ఆమె కెరీర్‌కు నెక్స్ట్ స్టెప్ కనిపిస్తోంది. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాలు చేస్తున్న ప్రభాస్, అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్ చరణ్‌లాంటి హీరోల దగ్గర హీరోయిన్ కాంబినేషన్స్ కూడా పెద్ద చర్చే అవుతున్నాయి. రష్మిక, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, త్రిప్తి డిమ్రి లాంటి పేర్లు వరుసగా పెద్ద సినిమాల్లో కనిపిస్తున్నాయి. అదే లిస్టులో మమిత పేరు కూడా చేరే టైమ్ వచ్చిందా అనిపిస్తోంది. కాకపోతే మమిత ఇప్పటివరకు చేసిన పాత్రలు ఎక్కువగా నేచురల్, యూత్‌ఫుల్‌గా ఉండేవే. పెద్ద యాక్షన్ సినిమా, భారీ సెటప్, స్టార్ హీరోతో గ్లామర్ ఎక్కువగా ఉండే పాత్రలో మాత్రం ఇంకా పరీక్ష కాలేదు. అందుకే ఒక్కసారిగా అలాంటి సినిమా వస్తే ప్రేక్షకులు ఎలా తీసుకుంటారన్నది కూడా చూడాలి. అదే సమయంలో ఇప్పుడున్న ఫ్రెష్ ఫేస్ ఇమేజ్ ఆమెకు పెద్ద ప్లస్ కావచ్చు. మరో విషయం ఏంటంటే మమితను ఇప్పుడు ఒక్క మలయాళ హీరోయిన్‌గా చూడడం కూడా కష్టం. 'ప్రేమలు'తో తెలుగులో పరిచయం ఉంది. తమిళంలో ఇప్పటికే విజయ్, ధనుష్, సూర్యలాంటి హీరోల సినిమాలు చేసింది. అంటే కొత్త పాన్ ఇండియా సినిమాలో తీసుకున్నా ఆమెను మొదటి నుంచి పరిచయం చేయాల్సిన అవసరం ఉండదు. మూడు ఇండస్ట్రీల్లో తెలిసిన ముఖం కావడం ఇప్పుడు మేకర్స్‌కు ఉపయోగపడే విషయం. అసలు లెక్క మాత్రం ఇప్పుడు ఆమె ఎలాంటి సినిమా ఎంచుకుంటుందన్నదే. మరో చిన్న లవ్ స్టోరీ చేస్తుందా.. లేక నేరుగా పెద్ద స్టార్ పక్కన కనిపిస్తుందా చూడాలి. ప్రస్తుతం ఉన్న క్రేజ్ చూస్తే మాత్రం మమితకు నెక్స్ట్ ఒక పెద్ద హీరో సినిమా పడితే కెరీర్ మరో లెవెల్‌కు వెళ్లే ఛాన్స్ ఉంది.

# మాస్ చాలూ.. నానికి ఇప్పుడు ఇదే కావాలా!



నాని కెరీర్‌లో ఇప్పుడు మాస్ సినిమాల హవా కాస్త ఎక్కువగా కనిపిస్తోంది. 'దసరా'తో మొదలైన ఆ మార్పు 'హిట్ 3' వరకు వచ్చింది. 'ది ప్యారడైజ్'లో అయితే లుక్ నుంచి క్యారెక్టర్ వరకు ఇంకా రఫ్‌గా కనిపించబోతున్నాడు. ఇలాంటి టైమ్‌లో నాని నుంచి మళ్లీ ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వస్తే బాగుంటుందని దర్శకుడు శివ నిర్వాణ చెప్పడం ఆసక్తిగా మారింది. అది తానే చేస్తానని మాత్రం ఇంకా చెప్పలేదు. నాని, శివ నిర్వాణ కలిసి ఇప్పటికే రెండు సినిమాలు చేశారు. శివ తొలి సినిమా 'నిన్ను కోరి' నానితోనే వచ్చింది. ప్రేమకథలో ఎమోషన్‌ను బాగా పట్టుకోవడంతో ఆ సినిమా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తర్వాత 'టక్ జగదీష్' చేశారు. అది ఆశించిన రిజల్ట్ ఇవ్వలేదు. అయినా ఇద్దరి మధ్య బాండింగ్ మాత్రం అలాగే ఉందని శివ చెప్పారు. కథ ఉంటే ఒక్క ఫోన్ కాల్‌తో నాని దగ్గరకు వెళ్లగలనన్నారు. కాకపోతే మూడో సినిమా కోసం ఇప్పుడే ఏ కథను రెడీ చేయడం లేదని శివ క్లియర్ చేశారు. నానితో మళ్లీ చేయాలంటే ముందుగా కథ తనకే విపరీతంగా నచ్చాలని చెప్పారు. 'వీళ్లిద్దరి కాంబినేషన్‌లో మూడో సినిమా ఇదే కావాలి' అనే ఫీలింగ్ వచ్చినప్పుడే నానికి వినిపిస్తానన్నారు. అంటే రెండు సినిమాలు చేశాం కాబట్టి మూడోది కూడా చేయాలనే తొందర ఆయనలో కనిపించడం లేదు. నాని ఏ రకమైన కథనైనా చేయగల నటుడని కూడా శివ చెప్పారు. కథల విషయంలో ఆయన ఆలోచన చాలా తెలివిగా ఉంటుందని అన్నారు. వరుసగా 'హిట్ 3', 'ది ప్యారడైజ్'లాంటి సినిమాల తర్వాత మళ్లీ ఫ్యామిలీ ఆడియన్స్‌కు దగ్గరయ్యే సినిమా చేస్తే బాగుంటుందనేది శివ అభిప్రాయం. నిజానికి 'హాయ్ నాన్న', 'అంటే సుందరానికీ' లాంటి సినిమాల్లో నాని ఆ జోన్‌లో ఎంత కంఫర్ట్‌గా ఉంటాడో ఇప్పటికే చూశారు. అయితే ఒక హీరో వరుసగా ఒకే తరహా సినిమాలు చేస్తే తర్వాత చిన్న మార్పు కూడా కొత్తగా కనిపిస్తుంది. నాని ఇప్పుడు మాస్, యాక్షన్ వైపు కొంత దూరం వెళ్లాడు. 'ది ప్యారడైజ్' తర్వాత వెంటనే మరో రఫ్ క్యారెక్టర్ కంటే మంచి ఎమోషనల్ ఫ్యామిలీ కథ పడితే ప్రేక్షకులకు కూడా ఫ్రెష్‌గా అనిపించే ఛాన్స్ ఉంటుంది. శివ మాట కూడా దాదాపు అదే వైపు ఉంది. కానీ ఆ సినిమా శివతోనే వస్తుందా అన్నది ఇప్పుడే చెప్పలేం. నానికి సరిపోయే కథ తనకు తట్టిన రోజే వెళ్లి చెబుతానని అన్నారు.

# సమాజంలో పరిస్థితులే హీరోకి విలన్!



మాస్ రాజా రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఇరుముడి'. అన్ని పనులు పూర్తి చేసుకున్న చిత్రం కొన్ని గంటల క్రితమే రిలీజ్ అయింది. ఈ సందర్భంగా సినిమా గురించి ఆసక్తికర విశే షాలను శివ రివీల్ చేసారు. అవేంటో ఆయన మాటల్లోనే... ఇది ఓ సినిమాలా కాకుండా యదార్థ జీవన ప్రయాణంలా ఉంటుంది. ఫార్ములా చిత్రాలకు భిన్నంగా, సహజత్వానికి పెద్దపీట వేస్తూ ఈ చిత్రాన్ని మలిచినట్లు తెలిపారు. 'ఇరుముడి' చిత్రంలో ప్రధాన ఆకర్షణ ఏంటంటే? ఇందులో ప్రత్యేకంగా విలన్ పాత్ర ఉండదు. కథానాయకుడు ఒక విలన్‌తో పోరాడటం కంటే నిత్య జీవితంలో ఎదురయ్యే పరిస్థితులు, సంఘటనలు, మనుషుల మధ్య జరిగే భావోద్వేగ సంఘర్షణలే ఇందులో కీలకం. రొటీన్ కమర్షియల్ ఫార్ములాను పక్కనపెట్టి సామాన్యుడు తన దైనందిన జీవితంలో ఎదుర్కొనే సమస్యలనే తెరకెక్కించామన్నారు. అలాగే చిత్రీకరణ విషయంలో దర్శకుడు తీసుకున్న నిర్ణయం కథకు ఎంతో బలాన్ని చేకూర్చింది. సినిమాలో చూపించే ప్రాంతాలను వేరే పేర్లతో పిలవకుండా? అవి ఎక్కడైతే చిత్రీకరించారో? ఆ ప్రాంతాల ఒరిజినల్ పేర్లనే (సీలేరు, డొంకరాయ వంటివి) సినిమాలోనూ యథాతథంగా ఉంచారు. ఒక ప్రాంతపు సంస్కృతి, అక్కడి వాతావరణం కథలో అంతర్భాగంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇలా చేయడం వల్ల ప్రేక్షకులు సినిమాను చూస్తున్నట్లు కాకుండా... తమ పక్కనే ఉన్న ఊరిలో తమకు తెలిసిన మనుషుల మధ్య కథ జరుగుతున్నట్లుగా ఫీల్ అవుతారు. సినిమా అంతా ఆర్గానిక్ ఫీల్‌తో సాగడం వల్ల పాత్రలు ప్రేక్షకుల హృదయాలకు మరింత దగ్గరవుతాయి. కృత్రిమ సెట్టింగ్‌లు లేదా కల్పిత లోకాల కంటే మనం నిత్యం చూసే పరిసరాల్లోనే కథను నడపడం ఒక కొత్త అనుభూతిని ఇస్తుందన్నారు. శివ నిర్వాణ గత చిత్రాలైన నిన్ను కోరి, మజిలీ వంటి వాటిలో కూడా చిన్న చిన్న సన్నివేశాల ద్వారానే గొప్ప ఎమోషన్స్‌ను పండించారు. తాజాగా ఇరుముడిలో కూడా అదే శైలిని కొనసాగించారు. మనుషుల మధ్య ఉండే సున్నితమైన బంధాలను, సంఘర్షణలను తెరపై ఆవిష్కరించారు. ఎలాంటి అదనపు గ్లామర్..యాక్షన్ హంగులు లేకుండా కేవలం భావోద్వేగాల బలం మీదనే సినిమాను నడపడం అన్నది మంచి కళాత్మక ప్రయత్నంగా చెప్పొచ్చు. అంతిమంగా ఇరుముడి అయ్యప్ప భక్తికి సంబంధించిన సినిమా మాత్రమే కాదు. ఇది ఒక తండ్రి, బిడ్డ, సమాజం మధ్య సాగే ప్రయాణం. వాస్తవికతకు అద్దం పడుతూ కళ్లకు కట్టినట్లుగా తెరకెక్కించే ప్రయత్నం చేసారు. ఈ చిత్రం ప్రేక్షకులందరినీ తమ సొంత కథగా భావించేలా చేస్తుందని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

# ధనుష్ రాజకీయాల్లోకి వస్తే నా మద్దతు...!




తమిళ్ సూపర్ స్టార్ విజయ్ రాజకీయాల్లో అడుగు పెట్టి సంచలనం సృష్టించాడు. కనీసం గౌరవప్రదమైన సీట్లు అయినా దక్కించుకుంటాడా అనే అనుమానాలు వ్యక్తం చేసిన వారు ముక్కున వేలు వేసుకునే విధంగా ఏకంగా అధికారంను దక్కించుకున్నాడు. తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రస్తుతం విజయ్ దేశ వ్యాప్తంగా పాపులారిటీని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. విజయ్‌ను ఇన్సిపిరేషన్‌గా తీసుకుని ఎంతో మంది స్టార్స్ రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. తమిళనాట రాజకీయాల్లో సినీ ఇండస్ట్రీకి చెందిన వారు చక్రం తిప్పడం ఇదేం మొదటి సారి కాదు, కనుక ముందు ముందు కూడా చాలా మంది స్టార్స్ రాజకీయాల్లో తమ అదృష్టం పరీక్షించుకునే అవకాశాలు ఉన్నాయి. ఆ క్రమంలోనే తమిళ్ హీరో ధనుష్ సైతం రాజకీయాల్లో తన అదృష్టంను పరీక్షించుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి అనేది తమిళనాట జరుగుతున్న చర్చ. ధనుష్ ప్రస్తుతం హీరోగా ఫుల్ బిజీగా ఉన్నాడు. ఏడాదికి మరే ఇతర హీరోలకు సాధ్యం కాని విధంగా రెండు మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న విషయం తెల్సిందే. ఒక వైపు హీరోగా వరుస సినిమాలు చేస్తూనే మరో వైపు దర్శకత్వం, ప్రొడక్షన్ చూసుకుంటూ, స్వచ్ఛంద కార్యక్రమాలు సైతం చేస్తూ ఉంటాడు. ధనుష్ రాజకీయాలపై ఆసక్తి కలిగి ఉన్నాడంటూ గతంలోనే ప్రచారం జరిగింది. రజనీకాంత్ అల్లుడిగా ఉన్న సమయంలోనే ధనుష్ రాజకీయాల్లో అడుగు పెడతాడని, మామ రజనీకాంత్‌ను ముందు నడిచి ధనుష్ వెనుక ఉండి రాజకీయం చేయాలి అనుకుంటున్నాడనే పుకార్లు షికార్లు చేశాయి. అయితే ఇటీవల ధనుష్ రాజకీయం గురించి, ఆయన పొలిటికల్ ఎంట్రీ గురించి పెద్దగా చర్చ జరగడం లేదు. ఇలాంటి సమయంలో సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ చేసిన వ్యాఖ్యలు మరోసారి ధనుష్ అభిమానుల్లో ఆసక్తికర చర్చకు తెర తీసినట్లు అయింది.సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ధనుష్‌తో తనకు ఉన్న అనుబంధం గురించి చెప్పుకొచ్చాడు. నా జీవితంలో అత్యంత సన్నిహితుడు, మిత్రుడు ధనుష్ అంటూ జీవీ ప్రకాష్ పేర్కొన్నాడు. అంతే కాకుండా ధనుష్ ఏ పని చేసినా నా పూర్తి మద్దతు ఆయనకు ఉంటుంది. ఆయన రాజకీయాల్లో అడుగు పెడితే తప్పకుండా నా పూర్తి మద్దతు ఉంటుంది. ఆయనకు ఒక మిత్రుడిగా వెంట ఉండి నడిచేందుకు రెడీగా ఉన్నాను అన్నాడు. జీవీ ప్రకాష్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ధనుష్ రాజకీయ అరంగేట్రం గురించి చర్చకు తెర తీశాయి. ప్రస్తుతానికి ధనుష్ పొలిటికల్ ఎంట్రీ ఉండక పోవచ్చు. కానీ భవిష్యత్తులో తప్పకుండా ధనుష్ రాజకీయం చేసే ఆలోచన ఉన్నట్లు మాత్రం అనిపిస్తుంది. హీరోగా ధనుష్ ఇంకా పదేళ్ల వరకు వరుస సినిమాలు చేసి అభిమానులను అలరించే అవకాశాలు ఉన్నాయి. విజయ్ ఇప్పుడిప్పుడే రాజకీయంగా అడుగులు వేస్తున్నాడు. ఆయన పట్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చిన సమయంలో మరో సినీ స్టార్ రాజకీయాలకు అవసరం అవుతుంది. అప్పుడు ధనుష్ ఎంట్రీ ఇస్తే బాగుంటుంది అనేది కొందరు విశ్లేషకుల అభిప్రాయం. ధనుష్ ఇప్పటికి ఇప్పుడు పొలిటికల్ ఎంట్రీ ఇవ్వకున్నా 2035 వరకు పార్టీ ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి అనేది ఆయన సన్నిహితులు ఆఫ్ ది రికార్డ్ చెబుతున్న మాట. అయితే అప్పటి వరకు పరిస్థితులు ఎలా ఉంటాయి, ఏ మలుపు తిరుగుతాయి అనేది చెప్పలేని పరిస్థితి. కనుక ధనుష్ రాజకీయ ఎంట్రీ గురించి వస్తున్న ఊహాగానాలు ప్రస్తుతం గాల్లో మేడలు, నీటి మూటలు అన్నట్లుగా కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ధనుష్ పూర్తి దృష్టి ప్రస్తుతం సినిమాలపైనే ఉంది, ఆయన ప్రేక్షకులకు మంచి కంటెంట్ ఇవ్వాలనే ఉద్దేశంతో యాక్టింగ్, డైరెక్షన్, ప్రొడక్షన్ చూసుకుంటున్నాడు. మరోసారి వెంకీ అట్లూరితో ధనుష్ సినిమా ఉంటుందనే వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా మాత్రమే కాకుండా ధనుష్ లైనప్‌లో మూడు నాలుగు సినిమాలు ఉన్నాయి. వచ్చే ఏడాది వరకు ధనుష్ బిజీ బిజీగా ఉండబోతున్నారు.

# దాడులతో జర్నలిస్టుల కలాన్ని ఆపలేరు

**- విశాలాంధ్ర జర్నలిస్ట్ గోవింద్‌పై దాడి చేసిన భూమాఫియా గుండాలను, అటువంటి వారికి అండగా నిలబడిన వారిని అరెస్ట్ చేసి క్రిమినల్ కేసులు పెట్టాలి : సిపిఐ డిమాండ్**








**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా పూస పాటిరేగలో స్థానిక అధికార పార్టీ రాజకీయ అండదండలతో పెచ్చురిల్లిపోతున్న రియల్ ఎస్టేట్ భూ మాఫియా గూండాల దాడిలో తీవ్రంగా గాయపడిన విశాలాంధ్ర దినపత్రిక జర్నలిస్ట్ పి.గోవింద్‌ను చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి ఉదయం తీసుకుని వస్తే అతన్ని కనీసం హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేసుకోకుండా టెస్టులు పేరుతో అతన్ని ఆసుపత్రి అంతా తిప్పించి డ్రామా నడిపించడం దారుణం. సిపిఐ నేతలు ఆసుపత్రి సూపరింటెండెంట్‌ని నిలదీయడం జరిగింది. అప్పటి కప్పుడు అతన్ని ఐ.సీ.యులో చేర్చడం జరిగింది. ప్రజల పక్షాన నిలబడి పదునైన కలంతో ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్న జర్నలిస్టుకి చికిత్స విషయంలోనే ఆసుపత్రి అధికారులు, వైద్యులు ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఇంక సామాన్య ప్రజల పరిస్థితి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంటుందని మండిపడ్డారు. దాడి ఘటనపై జిల్లా ఎస్పీ త్వరితగతిన కలుగచేసుకుని ఎటువంటి రాజకీయ ఒత్తిడిలకు తావివ్వకుండా ఎంక్వయిరీల పేరుతో కాలయాపన చేయకుండా సాక్ష్యాధారాలను పరిశీలించి దాడి చేసిన వారిని అటువంటి వారికి అండగా నిలబడిన వారిని కఠినంగా శిక్షించి క్రిమినల్ కేసులు పెట్టాలని సిపిఐగా డిమాండ్ చేస్తున్నాం. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భయం పుట్టేలా శిక్ష ఉండాలని కోరారు.

# గజపతినగరం పి.ఎస్ పరిధిలో పల్లెనిద్రలు

## ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు

**కాపుసంభం గ్రామంలో జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ పల్లె నిద్ర - అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు - శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు : సి.ఐ ఎస్.సన్యాసినాయుడు**









**గజపతినగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ ఉత్తర్వులు మేరకు గజపతినగరం పోలీస్ స్టేషన్ పరిధిలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.సన్యాసినాయుడు, సబ్ ఇన్స్పెక్టర్ కే కిరణ్ కుమార్ నాయుడుల ఆధ్వర్యంలో మండలంలోని అనేక గ్రామాలలో సర్కిల్ సిబ్బంది బుధవారం పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.సన్యాసినాయుడు గంగచొల్లపెంట గ్రామం లో, గజపతినగరం సబ్ ఇన్స్పెక్టర్ కె.కిరణ్ కుమార్ నాయుడు మరుపల్లి గ్రామంలోనూ, పోలీస్ సిబ్బంది గజపతినగరం, పురిటిపెంట, జిన్నాం, రామన్నపేట, కొనిస, లోగిస, పాత బగ్గాం గ్రామాలలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు. గజపతినగరం మండలంలో మొత్తంగా తొమ్మిది గ్రామాలలో పల్లెనిద్ర చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ పల్లె నిద్రలో భాగంగా సిబ్బంది గ్రామస్తులతో మమేకమై గంజాయి/ డ్రగ్స్‌వంటి చెడు అలవాట్ల వల్ల కలిగే నష్టాలు, అటువంటి వాటికి అలవాటు పడే వారిపై తీసుకునే చట్టపరమైన చర్యలు గురించి ప్రజలకు అవగాహన కలిగించారని ఎస్.ఐ కె.కిరణ్ కుమార్ నాయుడు చెప్పారు. మహిళల భద్రతకు, వివాహాలకు సంబంధించి గ్రామాల్లో ఉన్న సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నామని, సైబర్ నేరాలు, ఆన్లైన్ బెట్టింగులు పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించడం జరిగిందని ఆయన అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా, రహదారి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హెల్మెట్ ధరించి ప్రాణాపాయం లేకుండా చూసుకోవాలని తెలియజేయడం జరిగిందని ఆయన అన్నారు. గ్రామాలలో ప్రధాన కూడళ్ల వద్ద, గ్రామస్తులే సీ.సీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా గ్రామస్తులను మోటివేట్ చేసామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని సీ.ఐ ఎస్.సన్యాసినాయుడు, ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ గరివిడి మండలంలోని కాపుసంభం అనే గ్రామంలో పల్లె నిద్ర చేశారని, ఎస్.ఐ కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 300 మంది పోలీస్ అధికారులు పల్లె నిద్ర చేశారని ఎస్.ఐ కే కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు.

# గంటల వ్యవధిలో భూ సమస్యకు పరిష్కారం

**- కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి మానవీయ స్పందనకు ప్రజల హర్షం**
**- సుమోటో ఆప్షన్‌ను వినియోగించి వెబ్‌ల్యాండ్ అడంగల్‌లో తప్పుగా నమోదైన జీరో ఎక్స్‌టెంట్ సవరణ - రెవిన్యూ యంత్రాంగానికి అభినందనలు**





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి, ప్రభుత్వ సేవలను వారి ముంగిటకు అందించాలన్న జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశాలకు రెవిన్యూ యంత్రాంగం తక్షణ స్పందనకు నిదర్శనంగా డెంకాడ మండలంలో ఒక భూ సమస్యను గంటల వ్యవధిలోనే పరిష్కరించింది. డెంకాడ మండలం డెంకాడ గ్రామానికి చెందిన దుగ్గాపు అప్పలనరసమ్మ గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జిల్లా కలెక్టర్‌ను కలెక్టరేట్‌లో కలిసి తనకు ఉన్న భూమి వెబ్‌ల్యాండ్‌లో జీరో ఎక్స్‌టెంట్గా నమోదై ఉండటంతో మ్యూటేషన్ చేసుకోవడంలో ఎదురవుతున్న ఇబ్బందిని వివరించారు. తన భూమికి సంబంధించిన రికార్డులను సరిచేసి, మ్యూటేషన్ చేయించి ఇవ్వాలని ఆమె కలెక్టర్‌ను కోరారు. ఆమె సమస్యను విన్న జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి వెంటనే స్పందించి, డెంకాడ తహసీల్దార్ రాజారావుకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. సమస్యను ప్రాధాన్యతతో పరిశీలించి, నిబంధనల మేరకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాలతో రెవిన్యూ అధికారులు సంబంధిత రికార్డులను పరిశీలించి, వెబ్‌ల్యాండ్‌లో నమోదైన జీరో ఎక్స్‌టెంట్ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టారు. జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ ఆదేశాల మేరకు సుమోటో ఆప్షన్‌ను వినియోగించి వెబ్‌ల్యాండ్ అడంగల్‌లో నమోదైన తప్పును సవరించారు. అనంతరం సంబంధిత 1-బి, అడంగల్ ప్రతులను అందజేసి, మ్యూటేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.

తమ సమస్యను చెప్పుకున్న వెంటనే కలెక్టర్ స్పందించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చి, అదే రోజు పరిష్కారం చూపించడంపై అప్పలనరసమ్మ సంతోషం వ్యక్తం చేశారు. "అధికారుల చుట్టూ తిరగకుండా మా సమస్యను కలెక్టర్ గారు వెంటనే పట్టించుకుని పరిష్కరించారు" అంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అప్పలనరసమ్మతో పాటు పలువురు గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమస్యను అత్యంత వేగంగా పరిష్కరించిన రెవిన్యూ అధికారులు, సిబ్బందిని అభినందించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని సానుభూతితో పరిశీలించి, నిబంధనల పరిధిలో సాధ్యమైనంత వేగంగా పరిష్కరించాలన్న కలెక్టర్ ఆదేశాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు మేలు చేకూరుస్తున్నాయని ఈ ఘటన మరోసారి చాటి చెప్పింది.

# విలేఖరిపై దాడి హేయమైన చర్య

**- దాడిని తీవ్రంగా ఖండించిన జెడ్పి చైర్ పర్సన్ - మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)**



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా పూస పాటిరేగ మండల విశాలాంధ్ర విలేఖరి గోవింద్‌పై జరిగిన దాడిని జెడ్పి ఛైర్పర్సన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, భీమిలి వైసీపీ ఇంచార్జ్ మజ్జి శ్రీనివాస రావు (చిన్నశ్రీను) తీవ్రంగా ఖండించారు. జిల్లాలో విలేకరులపై ఇటువంటి దాడులకు పాల్పడే విష సంస్కృతి హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. విశాలాంధ్ర విలేకరి గోవింద్‌పై దాడి జరిగిందని తెలిసి చిన్నశ్రీను తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ దాడిని ఖండిస్తున్నట్లు చిన్న శ్రీను పేర్కొన్నారు. భాధ్యులపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బాధిత విలేకరి గోవిందుకు మెరుగైన వైద్య సేవలు అందించాలని చిన్న శ్రీను సూచించారు. దాడిలో గాయపడ్డ గోవింద్ త్వరగా కోలుకోవాలని జిల్లా పరిషత్ చైర్పర్సన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు.

# వెలుగు వృద్ధాశ్రమంలో ఆయుష్ శాఖ ఉచిత వైద్య శిబిరం




**విజయనగరం, (రాజధాని వార్తలు):** బాబా మెట్టలో ఉన్న 'వెలుగు వృద్ధాశ్రమం'లో ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.వి.మాధురి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరంలో ఆశ్రమంలోని వృద్ధులకు వైద్యులు ఉచితంగా కన్సల్టేషన్ అందించి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఎక్కువగా వేధించే గ్యాస్ట్రిక్ సమస్యలు, కీళ్ల నొప్పులు, మధుమేహం (డయాబెటిస్), రక్తపోటు (బీపీ) వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని పరీక్షించి తగిన ఆరోగ్య సూచనలు చేశారు. వైద్య పరీక్షల అనంతరం, వృద్ధులకు అవసరమైన పూర్తిస్థాయి మందులను ఆయుష్ శాఖ తరపున ఉచితంగా పంపిణీ చేశారు. తమ వద్దకే వచ్చి ఉచితంగా వైద్య సేవలు, మందులు అందించిన డాక్టర్ మాధురిని, వైద్య సిబ్బందిని వృద్ధులు, ఆశ్రమ నిర్వాహకులు అభినందించారు.

# దమ్ము - ధైర్యం ఉంటే వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలి

**- రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎం.సుబ్బయ్య**



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత, వైసీపీ ఎమ్మె ల్యేలు దమ్ము - ధైర్యం ఉంటే అసెంబ్లీకి రావాలి రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎం.సుబ్బయ్య సవాల్ విసిరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ, కుట్రలు చేసే పార్టీలకు, వ్యక్తులకు కాదు. ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎం సుబ్బయ్య సవాల్ విసిరారు. అసెంబ్లీకి వస్తే గతంలో వైసిపి ప్రభుత్వంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలో అవకతవకలు, అక్రమాలు బయట పడతాయని జగన్ అనే వ్యక్తి అడ్డంగా దొరికిపోతానన్న భయంతో వారు అసెంబ్లీకి రావటం లేదన్నారు. రోడ్డుపై హిట్ అండ్ రన్ తరహాలో వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ఏ కుట్రలూ పనిచేయవని, డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన వారికి చెబుతున్నామన్నారు. పూర్తి పారదర్శకతతో బాధ్యతతో, పూర్తి జవాబుదారీతనంతో నియా మకాలు జరిగాయన్నారు. విద్యావిధానంలో సంస్కరణలతో పాటు పరీక్షల్లోనూ మరింత పారదర్శకత తీసుకువస్తామని జరుగుతున్న అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించడం జరిగిందన్నారు. అలాగే మీకు దమ్ము ధైర్యం ఉంటే సిగ్గు మానం ఉంటే మీరు నిజమైన నిజాయితీ అయిన వైసీపీ నాయకులైతే మంత్రి లోకేష్ బాబు విసిరిన సవాలుకు మీరు సిద్ధమా అని ప్రశ్నించారు. ఇదే విషయం అసెంబ్లీలో కూడా తమ లోకేష్ బాబు, మీకు సవాల్ విసరడం జరిగిందని గుర్తు చేశారు. మీకు సిగ్గు మానం ఉంటే అసంబ్లీకి రండి అని సవాల్ విసిరారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 'రాష్ట్రపతి అవార్డు' అందుకున్న 'క్లూస్ టీమ్' ఇంచార్జ్ సిరికి లక్ష్మీ నరసింహారావు






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో ఆర్ఎస్ఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సిరికి లక్ష్మీ నరసింహారావు ప్రతిష్టాత్మక "ప్రెసిడెంట్ మెరిటోరియస్ సర్వీస్ మెడల్ - 2024 (ఉత్తమ సేవా పతకం)" అందుకున్నారు. అమరావతి (నేలపాడు)లో వైభవంగా నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. విధుల్లో ఆయన ప్రదర్శించిన అత్యున్నత క్రమ శిక్షణ, నిబద్ధత మరియు విశిష్ట సేవలను గుర్తించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ అవార్డుకు ఎంపిక చేసింది.

**43 ఏళ్ల సుదీర్ఘ సేవ - 'క్లూస్ టీమ్'లో 25 ఏళ్ల నైపుణ్యం**

లక్ష్మీ నరసింహారావుకి పోలీస్ శాఖలో 43 ఏళ్ల సుదీర్ఘ సేవా అనుభవం ఉంది. అందులో గత 25 ఏళ్లుగా విశాఖపట్నం సిటీ, అనకాపల్లి, మరియు ఏఎస్ఆర్ జిల్లాల్లో 'క్లూస్ టీమ్' విభాగంలో సమర్ధవంతంగా విధులు నిర్వహించారు. హత్యలు, దొంగతనాలు, రాబరీ, డకోయిటీ, అనుమానాస్పద మరణాలు తదితర సంఘటనల్లో ఘటనా స్థలాల నుంచి భౌతిక ఆధారాలను అత్యంత నైపుణ్యంతో సేకరించారు. సేకరించిన ఆధారాలను ఎఫ్ఎస్ఎల్ ద్వారా దర్యాప్తు అధికారులకు హైవో అందించి, క్లిష్టమైన కేసుల్లో నిందితులకు న్యాయస్థానాల్లో శిక్షలు పడేలా కీలక పాత్ర పోషించారు. గతంలో సాధించిన పురస్కారాలు 70 క్యాష్ రివార్డులు, 20 జీఎస్సీలు, సేవా పతకం, వీటన్నింటికీ మకుటంగా ఇప్పుడు రాష్ట్రపతి ఉత్తమ సేవా పతకం దక్కడం విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఆర్ఎస్ఐ లక్ష్మీ నరసింహారావును బుధవారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "నేర దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాల సేకరణ అత్యంత కీలకమైనది. లక్ష్మీ నరసింహారావు క్లూస్ టీమ్‌లో 25 ఏళ్లుగా నిబద్ధతతో అందించిన సేవలు ప్రశంసనీయం. ఆయన కృషికి దక్కిన సరైన గుర్తింపు ఇది. ఇది అనకాపల్లి జిల్లా పోలీస్ యంత్రాంగానికి దక్కిన గొప్ప గౌరవం" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, క్లూస్ టీమ్ ఇన్ స్పెక్టర్ టి.విజయ, తోటి సిబ్బంది పాల్గొని ఆర్ఎస్ఐ లక్ష్మీ నరసింహారావు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఈనెల 22న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదు

## - అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్










**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఈనెల 22న రాష్ట్ర ముఖ్యమంత్రి అనకాపల్లి జిల్లా పర్యటన సందర్భంగా ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్‌తో కలిసి కె-కోటపాడు మండలం, ఏ-కోడూరు గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాల్లో అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాఆంధ్ర కార్యక్రమములో పాల్గొనేందుకు ఈనెల 22న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా ఏర్పాట్లు సకాలంలో పూర్తిస్థాయిలో చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ నిర్మాణ పనులు, హెలి ప్యాడ్ నుండి సభా వేదిక వద్దకు వచ్చే రోడ్డు మార్గం పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఏ కోడూరు ఎస్సీ కాలనీలో ముఖ్యమంత్రి ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నందున అక్కడ అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. సభా వేదిక ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అనంతరం మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, ఆంధ్రప్రదేశ్ కొప్పుల వెలమ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పి.వి.జి. కుమార్ లతో కలిసి ఏ-కోడూరు జిల్లా పరిషత్ హై స్కూల్ లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి అధికారులకు జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని అమలు చేస్తోంది

## - విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలోని అర్హులైన వారికి పెన్షన్లు పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సామాజిక పింఛన్ల పంపిణీ గూర్చి అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ సాంకేతిక సమస్యల వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులపై కారణాలు తెలిసినప్పటికీ, తగిన చర్యలు తీసుకోకపోవడంపై జిల్లా కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. పెన్షన్ల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా మరియు సమర్థవంతంగా నిర్వహించడానికి పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు మరియు క్షేత్ర స్థాయి అధికారులకు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ దిశా నిర్దేశం చేశారు. డి.ఆర్.డి.ఎ పిడి కె.శచీదేవి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దాదాపు 7,000 నంబర్లకు సంబంధించిన ప్రక్రియను తక్షణమే పూర్తి చేసి, వచ్చే వారం నాటికి పూర్తిస్థాయి జీఎస్ స్టేట్‌మెంట్ సమర్పించాలని ఆదేశించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఎంపీడీఓలు మరియు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి నెలా లబ్ధిదారులందరికీ క్రమం తప్పకుండా పెన్షన్ అందేలా చూడాలి. పెన్షన్ పంపిణీకి ముందు రోజు రాత్రే పీడీవో లతో సమావేశం నిర్వహించి, కేటాయించిన లబ్ధిదారులందరికీ ఫోన్ కాల్స్ ద్వారా సమాచారం అందించాలని, ఫోన్ నంబర్ల నవీకరణ చేయలని తెలిపారు. మొత్తం 7,221 మంది పెన్షనర్ల ఫోన్ నంబర్లు డేటాబేస్‌లో అప్‌డేట్ కాకపోవడంపై నిరాశ వ్యక్తం చేశారు. ముఖ్యంగా వి.మాడుగుల (644), నాతవరం (573), చోడవరం (497) మండలాల్లో అధిక సంఖ్యలో పెండింగ్ ఉన్నాయని, ఎంపీడీవోలు తక్షణమే స్పెషల్ డ్రైవ్ చేపట్టి అన్ని ఫోన్ నంబర్లను తనిఖీ చేసి అప్‌డేట్ చేయాలన్నారు. పెన్షన్ అందజేసే క్రమంలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా సచివాలయ స్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# లోపిడి గ్రామంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలో బుచ్చయ్యపేట మండలం లోపిడి గ్రామంలో అప్పలనరసమ్మ ఫిర్యాదు మేరకు, సర్వే నంబర్ 162కు సంబంధించిన స్థలాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ రావాడ సీతారాం క్షేత్రస్థాయిలో ప్రత్యేకంగా పరిశీలించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో కలిసి వాస్తవ పరిస్థితులను నమోదు చేశారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాస్తవ పరిస్థితుల ఆధారంగా న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవడంపై దళితులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో ఎస్సీ కమిషన్ నిరంతరం ముందు ఉంటోంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.కోటపాడు మండల తహశీల్దార్, పోలీస్ యంత్రాంగం సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి వారి దేవాలయ కుంబాభిషేకం

## - విగ్రహ ప్రతిష్టాపనకు ప్రముఖులకు ఆహ్వానం



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** నంది హిల్స్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి వారి దేవాలయ కుంబాభిషేకానికి, విగ్రహ ప్రతిష్టాపనకు గురువారం శ్రీకాళహస్తి మాజీ శాసన సభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి, మాజీ దేవస్థానం పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ను కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం పలికారు. అలాగే కుంభాభిషేకానికి హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శాశ్వట్స్ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# బాడీ బిల్డింగ్ పేరిట ఇంజెక్షన్ల అక్రమ దందా.. నలుగురి అరెస్ట్



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** నగరంలో బాడీ బిల్డింగ్ పేరిట మెఫెంట ర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లను అక్రమంగా విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టైంది. టాస్క్‌ఫోర్స్ గోల్కొండ జోన్, గోషామహల్ పోలీ సులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో నలుగురు నింది తులను అరెస్ట్ చేశారు. వీరిలో ఇద్దరు ఇంజెక్షన్ల సప్లయర్లు, మరో ఇద్దరు వినియోగదారులు ఉన్నారు. నిందితుల నుంచి రూ.1.85 లక్షల విలువైన 50 మెఫెంటర్‌మైన్ సల్ఫేట్ వాయిల్స్‌తో పాటు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో వాయల్‌ను రూ. 160కు కొనుగోలు చేసి, దాదాపు రూ.900కు విక్రయిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ప్రధాన నింది తుడు ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్ నుంచి వాట్సాప్ ద్వారా ఇంజెక్ష న్లను ఆర్డర్ చేసి, షాడోఫ్యాక్స్ కొరియర్ ద్వారా హైదరాబాద్‌కు తెప్పిస్తున్నట్లు గుర్తించారు. జిమ్‌లో పరిచయమైన ఇద్దరు యువ కులు.. మొదట కండరాల పెంపు కోసం ఈ ఇంజెక్షన్లను వినియో గించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వాటి అక్రమ విక్రయాలపై దృష్టి సారించి గోషామహల్ ప్రాంతంలో కస్టమర్లకు విక్రయాలు సాగించినట్లు వెల్లడించారు. ఎంజే బ్రిడ్జి, భోలక్ష్మి మాత ఆలయం సమీపంలో కస్టమర్లకు ఇంజెక్షన్లు విక్రయిస్తున్న సమయంలో పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ అక్రమ దందా వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# అమరావతిలో ఎస్‌బిఐ సిబ్బంది నివాస గృహ సముదాయానికి కీలక ముందడుగు

**అమరావతి, (రాజధాని వార్తలు):**ఏపీ రాజధాని అమరావతిలో ఎస్‌బిఐ సిబ్బంది నివాస గృహ సముదాయానికి కీలక ముందడుగు పడింది. ఎస్‌బీఐ హౌసింగ్ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఎస్‌బిఐ- APCRDA మధ్య భూ అగ్రిమెంట్ పూర్తైంది. ఐనవోలులో మొత్తం 2.05 ఎకరాల్లో ఎస్‌బిఐ నివాస సముదాయాన్ని నిర్మించను న్నారు. దాదాపు రూ.214 కోట్లతో ఎస్‌బిఐ హౌసింగ్ ప్రాజెక్ట్‌ను చేపట్ట నున్నారు. 4.46 లక్షల చదరపు అడుగుల బిల్ట్-అప్ ఏరియాతో నిర్మాణం జరుగనుంది. జూన్, 2027లో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. 2028లోపు నివాస సముదా యం పూర్తి చేయడమే లక్ష్యమని అధికారులు వెల్లడించారు. ఇక, లింగాయపాలెం-ఉద్దండరాయునిపాలెంలో 3 ఎకరాల్లో ఎస్‌బిఐ ప్రాంతీయ




కార్యాలయాన్ని నిర్మించనున్నారు. ఎస్‌బిఐ కార్యాలయానికి గతంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. రాజధాని అమరావతిని జాతీయ స్థాయి ఆర్థిక, పరిపాలనా కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం, ఎస్‌బీఐ సిబ్బంది నివాస సముదాయ నిర్మాణం మరో ముఖ్యమైన అడుగుగా నిలవనుంది.

# బహిష్కరించక ముందే వెళ్లిపోండి.. కొండా సురేఖపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. సుస్మిత వ్యాఖ్యలకు తనను బాధ్యురా లిని చేయొద్దని, అది పూర్తిగా ఆమె సొంత అభిప్రాయమంటూ క్రమ శిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు బాలు నాయక్, నాయిని రాజేందర్ రెడ్డి స్పందిస్తూ.. కొండా సురేఖపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుస్మిత వ్యాఖ్యలతో సురేఖకు సంబంధం లేకపోతే ఖండించాలని అన్నారు.

**సుస్మిత వ్యాఖ్యలపై సురేఖ స్పందించాలి: బీర్ల ఐలయ్య**

ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం మామూలే అని.. సొంత పార్టీ వాళ్లు విమర్శలు చేస్తే ఎలా అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎత్తిన జెండాను దించకుండా పార్టీని అధికారంలోకి తెచ్చింది రేవంత్ అని.. ఆయనపైన విమ ర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. సుస్మిత వ్యాఖ్యలపై కొండా సురేఖ స్పందించాలని డిమాండ్ చేశారు. కష్టపడుతున్న సీఎంపై బండలేస్తారా అంటూ మండిపడ్డారు. సొంత పార్టీ నేతలే సీఎంపై విమర్శలు చేయడం బాధాకరమని ఐలయ్య అన్నారు.

**సీఎంపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం: వేముల వీరేశం**

కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో సురేఖకు సంబంధం లేకపోతే ఖండిం చాలని ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. కొండా సురేఖ భాష పార్టీని ఇబ్బంది పెడుతోందని.. ఓ నటి విషయంలో కూడా ఇలాగే మాట్లాడారని మండిపడ్డారు. 'మీ తప్పుడు భాషకు సీఎం మూల్యం చెలించాలా? మీ ఎంటర్టైన్మెంట్ కోసం పార్టీ బలి కావాలా? అధికారంలోకి రావడానికి రేవంత్ చెమట చుక్కలు త్యాగం చేశారు. ముఖ్యమంత్రిని వీక్ చేయాలనే కుట్ర చేస్తున్నారు. పార్టీలో జరుగుతున్న వ్యవహారంపై స్పందిస్తున్నాం. సీఎంపై ఎవరు తప్పుగా మాట్లాడినా చర్యలు తీసుకోవాలి. సీఎం నిర్ణయా లను తప్పు పట్టడం దుర్మార్గం. ఆయన నిర్ణయాలు తప్పు పట్టేవా ళ్లు పార్టీలో ఉండాల్సిన అవసరం లేదు. సొంత పార్టీ నేతలు ప్రతిపక్షాలకు గొంతు ఇస్తున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి తలనొ ప్పిగా మారిన వారిని పక్కన పెట్టాలి. పార్టీ వేదికలపై మాట్లా డాల్సిన విషయాలను బహిరంగంగా మాట్లాడతారా? మైక్ దొరికితే ఊగిపోతారా? సీఎంపై అసత్య ఆరోపణలు చేసినా, ఏకవచనంతో మాట్లాడితే ఊరుకోం' అని హెచ్చరించారు.



**సీఎం రేవంత్‌ను బలహీనపర్చాలని చూస్తున్నారు: బాలు నాయక్**

పార్టీకి వ్యతిరేకంగా రాజ్‌గోపాల్ రెడ్డి మాట్లాడినా, బాలు నాయక్ మాట్లాడినా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. షోకాజ్ నోటీసులు ఇచ్చి అయిపోయిందని అనుకో వద్దని.. కులం, హోదాలతో సంబంధం లేకుండా చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల కుట్రను సొంత పార్టీ వాళ్లు అమలు చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌ను బలహీన పర్చాలని చూస్తున్నారని, పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. పార్టీ అధికారం లోకి రావడానికి కారణం రేవంత్ అని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని బాలు నాయక్ ధీమా వ్యక్తం చేశారు.

**ఒక్క ఎమ్మెల్యేతోనైనా సరిగా ఉన్నారా: నాయిని రాజేందర్**

కొండా సురేఖపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏ పార్టీలోకి వెళ్తే ఆ పార్టీని బ్లాక్ మెయిల్ చేస్తున్నా రని, ఒక్క ఎమ్మెల్యేతోనైనా సరిగా ఉన్నారా అని ప్రశ్నించారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని వదిలి పోయారని.. వెళ్లేప్పుడు బీఫారంలు తీసుకొని వెళ్లిపోయారని విమర్శించారు. నిరాధార ఆరోపణలు చేసి ప్రతిపక్షాలకు ఆయుధం ఇస్తున్నారన్నారు. ప్రభు త్వంలో ఉంటూ వ్యతిరేకంగా మాట్లాడడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది మంది త్యాగాన్ని వృథా చేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. తప్పు చేసిన వారిపై నిర్ణయాలు కఠినంగా తీసుకోవాలన్నారు. కులాన్ని అడ్డుపెట్టుకొని ఏమైనా చేస్తామంటే కుదరదన్నారు. డూప్లికేట్ మనుషులు.. ఒరిజినల్ కాంగ్రెస్ అని మాట్లాడుతున్నారని, ఏమైనా ఉంటే అధిష్ఠానం దగ్గర తీర్చుకోవాలని సూచించారు. పార్లమెంట్‌లో సురేఖ నియోజకవర్గంలో మెజారిటీ తగ్గిందన్నారు. పార్టీ నుంచి బహిష్కరించే ముందే వెళ్లిపోవాలని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి హితవు పలికారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan